# పూలతేరు

మధ్యగదిలో చిన్నగాఆరంభమైన చర్చ చిలికి చిలికి గాలివానగా మారుతున్నట్లుంది. ధారాళంగానే మూలగది వరకూ వినిపిస్తోంది.

" ఈ మధ్య దీనికి నేనేం చెప్పినా వినే మప్పితం లేకుండా పోతోంది." కోమలి గొంతు కఠోరంగా ఉంది. అందులో ఏదో అసహనం, ఏదో భయం.

" సామాజిక శాస్త్రం నేను తీసుకుంటే నీకేం నష్టం ? " చిన్నగా లక్ష్మి ప్రశ్న.

' ఇంజనీరువో, డాక్టరువో అవుతావనుకున్నాను. ఆ ఆశ ఎలాగూ లేదు. వెధవ సోషియాలజీ ఎందుకు పనికొస్తుంది ఈ రోజుల్లో ? ముసలి ఆలోచనలన్నీ ఆ మూల గదిలోంచి వస్తూ ఉంటాయి కాబోలు....'

" నాకు అదంటే ఎంతో ఇష్టం. చదవాలనీ, పరిశోధన చెయ్యాలనీ ఉంది. నాకు రాబడే ముఖ్యం కాదు? "

" అవన్నీ ....బోలెడు కట్నం పోస్తే కానీ దమ్మిడీకిచెల్లరు. ఏమైనా అంటే పెళ్లే చేసుకోననడం అలవాటైంది. పులి మీద పుట్రలా సరిగ్గా ఆ ఎదురింట్లోనే వచ్చి దిగింది. పిల్లలు కనడానికీ, పెళ్ళికీ సంబంధమేమిటి అని వాదిస్తోందిట కూడాను ".

" ఇంతకీ ఎవరావిడ ? "అంటూ, కూతుర్ని వడగళ్ల వాన నుండి తప్పించే ప్రయత్నంలో శ్యామసుందరం కల్పించుకున్నాడు మధ్యలో.

" నాకు మాత్రం ఏం తెలుసును. మట్టి గొట్టుకు పోయిన రంగు జీన్స్ పంట్లాం వేసుకుని సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ సాయంత్రం ఇంటికొచ్చిన దగ్గరనుంచీ ఆ డాబా మీద సివంగిలా పచార్లు చేస్తూ ఉంటుంది. దగ్గరగా అంట కత్తిరించిన క్రాఫింగూ, అదీనూ, దాని కో కొడుకు. వాణ్ని ఎక్కడో దిగ విడిచి, బాలానగర్ దగ్గర ఫ్యాక్టరీలో పనికిపోతుందట.

మీ వారేమి చేస్తూ ఉంటారని ఆ పక్కింటి సీతారత్నం అడిగితే – నేను సింగిల్ పేరెంట్‌ని అని చెప్పిందట. ఆవిడకు ఆ మాటకు అర్థం తెలియక వచ్చేసిందట. "కోమలి తనకు తెలిసినదంతా చెప్పి అక్కసు తీర్చుకుంది.

" సరేలే, ఆవిడ పంట్లాంవేసుకుంటే నీకేం ? క్రాఫింగ్ చేసుకుంటేనేం? బారెడు జుత్తు పెంచుకుని తాపీగా పేలు తీసుకుంటూ కూర్చుంటే వేళకు ఆఫీసుకో, ఫ్యాక్టరీకో వెళ్లవద్దూ?"

ఈ వందలింపుతో కోమలి ఉక్రోషం ఇంకాస్త పెరిగింది. "అవును. అదెలా బతికితే నాకేం కానీ, మీ అమ్మాయి రోజూ పోయి కబుర్లాడి వస్తూ ఉంటుంది. అది వచ్చాకే ఈ ఎదురు ప్రశ్నలు ఎక్కువైపోయాయి."

ఇక శ్యామసుందరానికి ఆ సంభాషణ సాగదియ్యడం అంత మంచిది కాదనిపించిందో, ఏమో, ఆఫీసుకి వేళైందని బయలుదేరాడు.

" నేనూ వస్తాను. నన్ను ఆ మలకపేట దగ్గర దింపి పొండి. ఆదివారం మా స్కూల్లో ఉత్సవానికి కలెక్టరుగారి భార్య వస్తుందట. పిల్లలకి రిహార్సల్ చేయించాలి." అంటూ కోమలి వెళ్లింది. స్కూటర్ వెనకనే కూర్చుంది.

గాలివాన వెలసినట్టు ప్రశాంతత ఆ మధ్య తరగతి ఆవాసాన్ని ఆవహించింది.

* * *

అక్షరం విడిచిపెట్టకుండా ఆ రోజు వార్తాపత్రిక చదివి కళ్లద్దాలు ఓసారి తుడుచుకున్నాడు సింహాచలం. వినికిడి లోపం లేదు కానీ, చూపు కాసింత మందగించింది. పక్షిరెక్కలు రెపరెపలాడిన సద్దు విని కిటికీ దగ్గరగా వెళ్లి పరిశీలనగా చెట్ల గుబురులోకి చూశాడు. గుడ్లింకా పిల్లలయిన సందడి లేదు. ఒక గువ్వ మేతకి వెళ్తే గూడు విడవకుండా ఇంకొక గువ్వ గుడ్ల మీద కూర్చుని కాసుకొస్తున్నాయి. ఆ గువ్వల జంట. చాలాకాలంగా తనమీద పడ్డ ఒంటరితనాన్ని సింహాచలం ఇలాటి పరిశీలనతో లోకాన్ని చూస్తూ గడపడానికి అలవాటు పడిపోయాడు. కొడుకు శ్యామసుందరానికి ఏదో ఇంజనీర్స్ సంస్థలో ఉద్యోగం. కోడలు కోమలి చిన్న ప్రైవేటు స్కూల్లో పనిచేస్తుంది. మనవరాలు లక్ష్మి ఎప్పుడైనా వచ్చి పలకరించినా, పనిమనిషి అచ్చమ్మ ' దొరా! ఎట్లున్నవో ' అని అడిగి కష్టం సుఖం చెప్పుకున్నా, ఆ సమయంలో కోడలు ఇంట లేదని అర్థమైపోతుంది అతనికి.

" తాతా!" అంటూ హడావిడిగా వచ్చి మంచం దండీ మీద కూర్చుంది లక్ష్మి. మరీ

చిన్నతనంలో అయితే వెనకాలే వచ్చి గుభీమని వీపుమీద వాలి తన చిన్నారి చేతులు కంఠం చుట్టూ పెనవేసి తాతని ముందుకు పడవేసేటంత హంగామా చేసేసేది. అలా వచ్చి పలకరించినా, ప్రశ్నించినా "మిమ్మల్ని ఒంటరిని చేసిపోయాను. పాపం, ఎలా ఉన్నారో...." అని ఓదార్చడానికే తన అనూరాధ పసిపిల్ల రూపంలో వచ్చిన భ్రమ కలిగేది. సింహాచలం కళ్ల చెమ్మగిల్లేవి. 'అయ్యో తాతా! నీ కంట్లో ఏదో నలుసు పడినట్లుంది' - అని కళ్లలోకి చల్లగా ఊదిన మనవరాలి అమాయకత్వం తలచుకుంటే ఇంకాస్త నీళ్లు నిండేవి. ఇప్పుడు లక్ష్మి ఇంటర్ పాసయింది. అచ్చంగా అనూరాధ పోలికే.

"ఎదురింటి అమేజాన్ పేరు చెప్తే చాలు - అమ్మ మండిపడుతుందెందుకు తాతా?" విశాలమైన కళ్లను ఇంకాస్త పెద్దవి చేస్తూ మనవరాలు అడిగిన ప్రశ్నకు వింతగా నవ్వాడు సింహాచలం.

"సమాజంలో మార్పు అంటేనే భయపడుతుంది మీ అమ్మ. ఉన్న వ్యవస్థ విరిగితే చాలు ఏలాటి మార్పు వచ్చినా మేలే అన్న ఆశ కొత్తగా ఎదురింట్లో దిగిన ఆ అమ్మాయిది" అన్నాడు.

"నా పేరు లక్ష్మి అని చెప్తే విని నవ్వింది ఎదురింటి అమేజాన్. తన కలాటి సంప్రదాయపు వాసన ఉన్న పేరు నచ్చదట, అందుకే తనకేదో పేరు పెడితే తీసేసి అమెజాన్ అని మార్చేసుకుందట."

"సంప్రదాయమనీ, వివాహమనీ ఆడప్రాణి స్వేచ్ఛను హరించడానికి సమాజం చేస్తున్న కుట్ర అంటుంది. అందుకే ఆవిడకు వివాహ వ్యవస్థ మీద కసి అంటుంది."

మనవరాలు కళ్లలోని ఆశ్చర్యం,సందేహం చూస్తే సింహాచలానికి ఒక శిశువుని చూసినట్లు అనిపిస్తుంది. చిన్న వెలుగు రేఖనో, శబ్దాన్నో చూసినా, విన్నా చలించిపోయే శిశువులాగే కొత్త ఆలోచనలకూ, అనుభవలకూ ప్రభావిత మైపోతుంది. ఆ పిల్ల సందేహాలు తీర్చే నేర్పూ ఓర్పూ తల్లికి లేదు. అడిగేటంత చనువు పిల్లకూ లేదు.

"పాపం అన్నీ ఒక్కర్తే చూసుకుంటుంది. కొడుకుని హాస్టల్‌లో పెడితే మత్తుమందు అలవాటు చేసుకున్నాడట. పెళ్లి అని తొందరపడి ఉచ్చులో పడకు, ఒంటరిగా ఆడది బతకలేక పోదు - అని మొన్న సలహా ఇచ్చింది." లక్ష్మికి తాత అభిప్రాయం తెలుసుకోవాలన్న ఆరాటం ఆ అమేజాన్ ప్రసక్తిలో కనిపిస్తోంది.

"వేదకాలంనాటి స్త్రీలు కొందరు పెళ్ళిళ్లు చేసుకోకుండా సన్యాసినులుగా ఉండి విద్యకి అంకితమైన వాళ్లు లేకపోలేదు. గ్రంథాలు రాశారు. సమావేశాల్లో పాల్గొని వాదనలు చేసే వాళ్లూ ఉండేవారు. వాళ్లని ఆనాటి వాళ్లు గౌరవించారు. చిన్న చూపు చూసి ఈ సడించలేదు, బాధ పెట్టలేదు. యుక్తవయసు వచ్చిన కన్యలు వాళ్లకి నచ్చిన యువకుల్ని వరించి పెళ్లిళ్లు చేసుకునేవారు. కొందరు యుద్ధాల్లో పాల్గొని భర్తల రథాలను నడిపారు అని చెప్పడానికి ఋగ్వేదంలో ఆధారాలున్నాయి. స్త్రీలకు స్వేచ్ఛ లేకపోలేదు. అయితే వివాహ వ్యవస్థ మీద కసి, వ్యతిరేకంగా ప్రచారం లేదు."

"ఈ వివాహాలు మధ్యలో మనం తెచ్చిపెట్టుకున్నామట కదా. మొదట్లో లేవంది అమేజాన్"

ఈ మాట విన్న సింహాచలం ఆపుకోలేక పగలబడి నవ్వాడు. అంతగా నవ్వడానికి కారణం ఊహించలేక ఆశ్చర్యంగా చూసింది తాత ఏమి చెప్తాడో అని.

"నిజమే ఆ వెర్రిపిల్ల అన్నట్టు వివాహాలు మొదట్లో ఉండకపోవచ్చు. మరి మనం మాట్లాడుకుంటున్న భాష కూడా మొదట్లో ఉండి ఉంటుందా? మూగ సౌజ్ఞలూ, గావుకేకలతో ఆదిని మనుషులు కాలం గడిపి ఉంటారు. పెడబొబ్బలూ, గావుకేకలూ వేసుకుంటూ, అసూయ ఆవేశాలతో ఒకరి నొకరు చంపుకుంటూ ఉన్న దశలోంచి తరతరాల అనుభవంతో భాష వివాహ వ్యవస్థ మనకు వారసత్వంగా వచ్చి ఉంటాయి. అవి మన స్వేచ్ఛకు అడ్డు అని విడిచిపెట్టుకుని వేల సంవత్సరాల వెనకటి దశకు పోలేం కదా. మన అవసరాలకు అనుగుణంగా వ్యవస్థనీ, భాషనీ సంస్కరించుకోవాలి. కానీ, అన్నప్రాసన నాడే ఆవకాయ అన్నట్లు వివాహ వ్యవస్థ నడుం విరిచి స్వేచ్ఛనూ, సమతనూ సాధించాలంటుందా మీ అమేజాన్? మనం దురాశతో జీవితాల్ని వ్యాపారాలుగా మార్చేసుకుని కాలుష్యం కలుపుకుంటూ ఉంటే పెళ్లి వ్యవస్థని తప్పుపట్టడమెందుకూ? సమగ్రమైన జీవితానికి దాని అవసరం ఉందని గుర్తించబట్టే ఏదో రూపంలో అన్ని సమాజాల్లోనూ వేల సంవత్సరాలుగా నిలిచింది." అన్నాడు సింహాచలం.

"పెళ్లి చేసుకోకుండా నేను బతకడం లేదా అని అడిగింది నన్ను. ఎందుకు బతకలేం?"

"వెర్రి పిల్లలా ఉంది. జీవితంలో తనకు. జరిగిన అన్యాయానికో, చేదు అనుభవానికో గురై అలా కసి, కోపం పెంచుకుని ఉందేమో! ఈతరం వచ్చే తరానికి బాధ్యత వహించాలి. పిల్లలు ప్రేమ, అభిమానాల మధ్య ఆరోగ్యంగా పెరగాలి అనుకున్నప్పుడు ఇల్లు, కుటుంబం

వాటికి ఆధారమైన వివాహం ఉండకపోతే ఎలా ? తోటి మనుషుల్ని గౌరవించడం, కలిసి మెలసి సామరస్యంతో బతకడం ఇంట్లో నేర్పందే సమాజంలో ఎలా బతుకుతారు పిల్లలు ? జీవితం అంటే! ఏదో సత్రంలో ముసాఫిర్లలా ఎలాగో గడిపి పోవడంకాదు కదా. అలా మన పూర్వీకులు అనుకుంటే ఈ భాషా, ఈ చదువులూ, సంప్రదాయాలూ మనకు అందేవా, లక్ష్మీ?" అన్నాడు నెమ్మదిగా.

వీధిలో కోమలి వచ్చిన సందడైతే లక్ష్మి తలుపు తియ్యడానికి వెళ్లింది. అలా ఆనాటి ఆలోచనలకు తెరపడింది. సింహాచలం కాసింత విశ్రమించాడు.

★★★

శనివారం సాయంత్రం మధ్య గదిలో ఏదో చిన్న వివాదం తలెత్తింది. శ్యామసుందరం గొంతు కంగుమని కంచుగంటలా ఆవేశంతో వినిపిస్తోంది.

"మూడు రోజులై వచ్చిన శుభలేఖ ఇక్కడ ఇలా పడి ఉంది. ఇది వచ్చినట్టయినా నాకు చెప్పలేదు. పోనీ నా టేబుల్‌మీద పడేసినా చూసుకునే వాణ్ని" అన్నాడు.

"ఏదో హడావిడిలో మరచిపోయి ఉంటాం. దాని కింత రాద్ధాంతమా ? పెళ్లిళ్లు చేసుకోకుండా ఉంటారా ? పిల్లల్ని కనకుండా ఉంటారా ? పిలిచిన ప్రతీ పెళ్లికీ వెళ్లగలమా" ? అంటూ విసుక్కుంది కోమలి.

"నే నిక్కడే ఉంటున్నట్టు ఎవరు చెప్పారో. ఎలా తెలిసిందో, పాపం, అభిమానంగా నా చిన్ననాటి స్నేహితుడు పంపిన శుభలేఖ, కొడుకు పెళ్లి చేసుకుంటున్నాడు. వెళ్తే ఎంత సంతోషిస్తాడో నీకేం తెలుసు ?"

"అయితే మరి వెళ్లరాదూ ?"

"వెళ్లగలిగితే ఇలా నాకు కోపం ఎందుకొస్తుంది. రేపు ఉదయమే బెంగుళూరుకు ప్రయాణం పెట్టుకున్నాను. ముందుగా తెలిసి ఉంటే ఇంకెవర్నయినా సమావేశానికి పంపే ఏర్పాటు చేసి నేను తప్పక ఈ పెళ్లికి వెళ్లేవాణ్నే. పోనీ, నువ్వైనా మన ఇంటి తరఫున వెళ్తే బావుంటుంది."

"ఎవ్వరూ తెలీని ఇంట పెళ్లికి నే నెందుకూ? అయినా ఆదివారం మేం స్కూల్లో కార్యక్రమం పెట్టుకున్నాం."

"పోనీలే. నాన్నగార్ని బ్రతిమాలి పంపుతాను. నా స్నేహితుడు ఎంతో సంతోషిస్తాడు. మా ఇంటికి చిన్నతనంలో వస్తూ ఉండేవాడు."

"ఎక్కడ మల్కాజిగిరి, ఈ ఎండలో ఎలా వెళ్తారు."

"లక్ష్మిని సహాయంగా తీసుకుని వెళ్తారు. అది కూడా పెళ్లి ఎలా జరుగుతుందో చూస్తుంది. ఆదివారం కదా."

అలా ఆ సమస్య ఒక కొలిక్కి వచ్చింది.

★★★

తాతా మనవరాలూ ఆదివారం మల్కాజిగిరి కూడలి దగ్గర శుభలేఖలోని ఇంటి నెంబరు చూసుకుంటూ, దారి వెతుక్కుంటున్నారు.

"ఏమోయ్ సింహాచలం నువ్వేనా ? అవునా, కాదా అని సందేహంలో పడిపోయాను. ఎంత అదృష్టం!" అని విచిత్రమైన జీరతో ఒక ముసలి గొంతు సరిగ్గా వాళ్ల వెనకనుండి వినిపించింది.

ఇద్దరూ వెనక్కు తిరిగారు, ఒకరి మొహంలోకి ఇంకొకరుగా ఆ వృద్ధులిద్దరూ చూసి మురిసిపోతూ ఆప్యాయతను ఒలికించుకుంటూ ఉంటే లక్ష్మికి నవ్వు ఆపుకోవడం కష్టమైంది.

ఆమె చేతిలోని శుభలేఖను చేతిలోకి తీసుకుంటూ పట్టరాని ఆనందంతో " సరెసరి.... మగపెళ్లివారు పంపిన శుభలేఖ పుచ్చుకొని నా మనవరాలి పెళ్లికే వచ్చారన్నమాట. పదండి. అదిగో ఆ సందులోనే ఇల్లు. స్నాతకం అయింది. భోజనాలకు వడ్డన జరుగుతోంది. నువ్వు సంతోషిస్తావని చెబుతున్నాను...." అని ఉత్సాహంగా చెప్పుకుపోతున్న వృద్ధుణ్ణి తాత వింటూ అనుసరిస్తూ ఉంటే, వాళ్ల వెంట లక్ష్మి నడిచింది.

"మా అమ్మాయికి ముగ్గురూ ఆడపిల్లలే. ఎంతో బెంగ పడిపోయేది. ఇదే పెద్దది. ఉద్యోగం చేసుకుంటూనే ఏదో కరెస్పాండెంట్ కోర్సట. అందులో చదువుకుంటోంది. పెళ్లి కొడుక్కి ఏదో పెద్ద కంపెనీలోనే ఉద్యోగం. ఇద్దరూ ఒకళ్లనొకళ్లు నచ్చుకునిపెద్దవాళ్లకు నోటీసు లాంటిది ఇచ్చారు. కట్నాలు కానుకలు ప్రసక్తికానీ, ఆర్భాటాలు అలకలు కానీ ఉండకుండా పెళ్లిచేసే ఉద్దేశం ఉంటే సూక్ష్మంగానే సంప్రదాయం ప్రకారం చేసుకుంటాం, లేకుంటే రిజిస్ట్రారు ఆఫీసులోనే అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అబ్బాయి వేపు వాళ్లు ఏం అంటారో అని ఆలోచించాం. వాళ్లు కూడా ఏ పేచీ లేకుండా సరే అన్నారు. తక్కువ వ్యవధిలో ముహూర్తం

పెట్టి జరుపుతున్న పెళ్లి. పిల్లవాడి ఆఫీసులో ఉద్యోగులూ, పిల్ల ఆఫీసు లోని ఉద్యోగులూ, నడుం కట్టి చకచక ఏర్పాట్లు చేస్తున్నారు."

సింహాచలం మొహంలో విచిత్రమైన ఆనంద రేఖ విరిసింది. "విశృంఖల స్వేచ్ఛకు వెంపరలాడే ఈ రోజుల్లో యుక్తవయసు వచ్చినయువత వాళ్ల కాళ్లమీద నిలబడి నచ్చిన వివాహం చేసుకుంటా మని ముందుకు వస్తే అభినందించి, అక్షింతలు వెయ్యడమే పెద్దవాళ్లకు ధర్మం. ఇవి బాల్య వివాహాలు కావు. అడ్డ తగలడ మెందుకూ? వివాహ వ్యవస్థ వేపు ఆదరం చూపితే, ప్రోత్సహించడమే ఈతరం పెద్దల విధి" అన్నాడు సింహాచలం.

పచ్చని మావిడాకుల తోరణం, వాకిట వేసిన ముగ్గూ సాదరంగా ఆహ్వానిస్తున్న ఇంట్లోకి అడుగు పెట్టారు. పందిట్లో భోజనాలు చేస్తున్న వారంతా కలిపితే ముప్ఫై నలభై మించి లేరు. కళ్యాణ తిలకం, బుగ్గని చుక్కా, కాటుక దిద్దిన చారడేసి కళ్ల అమ్మాయి అందరిగ్లాసుల్లోనూ తాగేనీరు పోస్తూ ఉంటే, పెళ్లికొడుకు అలంకరణలో ఉన్న యువకుడు స్నేహితులతో కలిసి వడ్డనలో పాల్గొంటున్నాడు. లక్ష్మి ఒకటి రెండు పెళ్లిళ్ల జ్ఞాపకం తెచ్చుకుంది. ఇలాటి దృశ్యం ఇది వరకు చూసినట్టు తోచలేదు. ఆ మాటే చిన్నగా తాతతో అంది లక్ష్మి

" వ్యవస్థ వెనుక పరమార్థాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న వాళ్లకి పద్ధతుల్లో అంతగా పట్టింపు ఉండదు. మా చిన్నతనంలో ఐదేసి రోజులు, మూడేసి రోజులు పెళ్లిళ్లు జరిపేవారు. కొన్ని పెళ్లిళ్లలో కట్నాల దగ్గరా, సంప్రదాయాల పేరుమీదా పెద్దగా దెబ్బలాడుకోవడం కూడా ఉండేది మరి" అన్నాడు సింహాచలం.

భోజనాలు అవగానే సింహాచలం స్నేహితుడు అక్కడున్న నలుగురు యువకుల్ని పేరు పేరునా పిలిచి " ఇదిగో ఇప్పు డున్నంతగా ఆటలకు ప్రోత్సాహం ఉంటే సింహాచలం అంతర్జాతీయ స్థాయికిఎదగవలసి ఆటగాడు. గోలు ముందు నిల్చున్నాడంటే అక్షరాల సింహాచలాన్ని అడ్డుపెట్టి నట్టే. ఎదుటి జట్టు ఇతన్ని చూడగానే నిరుత్సాహపడిపోయేవారు. ఇక బంతి పుచ్చుకొని కాలితో ఒక తన్ను తంతేఅది ఆకాశంలో తేలి సరిగ్గా ఎదుటి వాళ్ల గోలు ముందు పావురంలా వాలేది. మేం ఆనందం పట్టలేక అరుపులతో కప్పించేవాళ్ళం." అని ఒకనాటి అనుభవాలు చెప్తూ ఉంటే లక్ష్మి ఎంతో గర్వంతో చూసి, తనతో ఎన్నడూ తాత ఈవిషయాలు చెప్పలేదే అనుకుంది మనసులో.

" నువ్వునాకన్నా పెద్దవాడివి. భుక్తాయాసం తీరుతుంది కాస్త నడుం జారవెయ్యి.

ముహూర్తానికి ఎంత లేదన్నా రెండున్నరగంటల వ్యవధి ఉంది." అని ఆ స్నేహితుడు ఒక మంచం తెప్పించి తాత కోసం వారగా వేయించి, పెళ్లి పనుల్లో నిమగ్నమై పోయాడు.

వయసును బట్టీ జట్లుజట్లుగా ఎక్కడి వాళ్లు అక్కడ సర్దుకున్నారు. కొందరు ఒకమూల పేకాట ప్రారంభించారు. కొందరు పిల్లలు అంత్యాక్షరి పాడుకుంటున్నారు. సింహాచలం దగ్గరకు వెళ్లి ఒకరి తర్వాత ఒకరుగా అటూ ఇటూ తిరిగే ముసలివాళ్లు ఎందరో ప్రత్యేకంగా పలకరించి పోతున్నారు. లక్ష్మికి ఏమీ తోచక అక్కడ సందడిని పరికిస్తూ నిలబడింది. చిన్నచిన్న పిల్లలు ఏ ఆంక్షలు లేకుండా ఇటూ అటూ పరుగులు తీస్తూ ఆడుకొంటున్నారు.

ఇద్దరు కుర్రాళ్లు నాలుగు రాటలు, నాలుగు సన్నని వెదురు బొంగులు తెచ్చి ఒక వారగా పడేసిపోయారు. నాలుగు రేకు డబ్బాలు మరో ఇద్దరు తెచ్చి అక్కడ పెట్టారు. లక్ష్మి ఆ దిశగా రెండు అడుగులు వేసి వాటి ఉపయోగమేమిటో అర్థంకాక కుతూహలంగా చూస్తోంది. ఇంతలో ఒక అమ్మాయి పచ్చని కొబ్బరాకులు తెచ్చివేసింది.

కాసింత దూరంలో ముగ్గురు అమ్మాయిలు అంతా లక్ష్మి వయసువాళ్లే - కూర్చుని కిలకిల నవ్వుకుంటూ, వాళ్ల మధ్య చామంతులు, మల్లెలు, కనకాంబరాలు, నీలాంబరాలు రాశిగా పోసుకుని ఒక్కోరకం పూలను ఒక్కోదండగా, అఖండంగా అల్లుకు పోతున్నారు. మధ్యమధ్య ఛలోక్తులతో హుషారుగా ఉన్నారు.

"నేను కూడా ఆ మల్లెలు గుచ్చనా" అని వాళ్ల దగ్గరకు పోయి లక్ష్మి కలివిడిగా వాళ్లతో కలసిపోయి మల్లెలు దండగా గుచ్చుతోంది. తనకు వెనకనే కాసింత దూరంలో ఇద్దరు ముత్తైదువలు ఏదో మాట్లాడుకుంటున్నారు. వాళ్ల వయసు అరవై దాటే ఉండొచ్చు అనుకుంది - ఒక మారు అటుగా చూసి.

కొంత దూరాన ఏదో చిన్న సందడి ప్రారంభమైంది. ఒక అమ్మాయి చదరంగా ముగ్గు పోసింది. నాలుగు మూలలా రేకుడబ్బా లుంచి, అందులో ఒక కుర్రాడు ఇసుక పోశాడు. నాలుగు రాటల్ని ఆ డబ్బాలో గుచ్చి నిలిపాడు. నిటారుగా రాటలు నిలవడానికి ఇంకాస్త ఇసుకపోసి గట్టిగా చేత్తో తట్టాడు. ఆ డబ్బాలు కనపడకుండా రంగురంగుల కాగితాలను ఒక అమ్మాయి వాటి చుట్టూ అంటించింది. ఒకపొడుగాటి యువకుడు ఆ రాటల పైకొసలను కలుపుతూ అడ్డుగా వెదుళ్లుంచి తాటితో గట్టిగా బిగించి కట్టాడు. అంతా సర్కస్ వాళ్లలా చక చక వాళ్ల పనులు నిమిషాల మీద పూర్తిచేసుకున్నారు. కొబ్బరాకుల ఈనెలతో చిత్రంగా పచ్చని

చాపల్లా అల్లారు. నిలువురాటలు, వెదుళ్ళూ కనపడకుండా కొబ్బరి చాపలతో చుట్టి తాళ్ళతో కట్టారు. ఒకపచ్చని పొదరింట ఆకృతి రూపు దిద్దుకుంది. అలా నిలబడ్డ మండపం పచ్చగా బావుంది కానీ, ఒక పార్శ్వానికి ఒరిగినట్టుంది. ఎంతగా వాళ్ళు సవరించినా ఏదో ఒక వేపుకు కాసింత ఒరిగి అవలక్షణంగా తోస్తోంది. మల్లెలు వండగా అల్లుతున్న లక్ష్మికి ఉపాయం తట్టింది. లేచి వెళ్ళింది. ఒక చిన్నతాడు తీసుకుని ఒక ప్రక్కకు ఒరుగుతున్న రాటకు కట్టి దగ్గరగా ఉన్న కిటికీ ఊచ వేపుకు లాగి ముడివేసింది. అక్కడికి ఆ సమస్య పరిష్కారం అవడంతో అందరూ తేలికగా నవ్వుకున్నారు. ఒక అమ్మాయి ఆ తాటికి రంగు కాగితాలు వేలాడదీసి ఒక తోరణంగా మార్చేసింది. పెళ్లి చవిక ఏర్పాటయింది. లక్ష్మి తిరిగి తనస్థానంలో కూర్చుని మల్లెలు చేతిలోకి తీసుకుంది.

తన వెనకను కూర్చున్న ఇద్దరు స్త్రీలు నిర్విఘ్నంగా మాట్లాడుకుంటూనే ఉన్నారు. " ఒసే, రమా! ఆ మంచంమీద ముసలాయన ఎవరే ? ఇందాక నువ్వు కూడా పోయి పలకరించి వచ్చావు కదా "అని అడగడంతో లక్ష్మికి అర్థమైపోయింది. వాళ్ల మాటలు తాత చుట్టూతిరుగుతున్నాయని, ఉత్కంఠతో ఒకచెవి అటు ఉంచింది.

" నాతో చదువుతున్న అనూరాధ అనే అమ్మాయి ఇతన్ని చేసుకుంది. ఆకథంతా ఇప్పుడు తెమలదు" అంది రమ.

" అయితేనేం చెప్పవే. ఇంకా కావలసినంత వ్యవధి ఉంది," అని ఆ శ్రోత అడగడంతో రమ కథను ప్రారంభించింది. లక్ష్మి కూడా వాళ్లకు తెలియని శ్రోతగా వింటోంది.

ఆ రోజుల్లో మా ఊళ్లో కాలికి చెప్పులేసుకుని చేత్తో గొడుగు పట్టుకుని ఆడది రోడ్డు మీద నడిస్తే అదో పెద్ద సాహసం అనుకునే వారు అమ్మలక్కలు, అబ్బో దాని కెంత పొగరే, అని బుగ్గమీద వేలేసుకుని నోరు తెరచి చూసేవారు. ఇక మగాళ్లసంగతి సరేసరి. నేనూ, అనూరాధా కలిసి హైస్కూల్లో చదివి కాలేజీలో ప్రవేశించే నాటికి కాసింత పరిస్థితి మెరుగైనా ఇద్దరు ఆడపిల్లలు ఒక్కో క్లాసులో ఉంటే అదే గొప్ప విషయం. ఉన్నట్టుండి మా అనూరాధా సైకిలేసుకు ఒకరోజు కాలేజీకి వచ్చేసి సంచలనం సృష్టించింది. అలాటి చొరవకు సులభంగా రాజీ పడలేక మగపిల్లలంతా పిల్లి కూతలూ, కుక్క అరుపులు వినిపిస్తూ చాలా కాలం విసిగించారు. తొలిరోజు నుంచీ అభినందనలు కురిపించినవాడు సింహాచలం ఒక్కడే. ఇతను బాగా పేదవాడు. ఉపకార వేతనాల బలంతోనే చదువు సాగించాడు. అనూరాధకు ఆస్తులు పెద్దగా ఉండేవో,

లేదో తెలియదు కానీ చాలా ఆడంబరంగా కాలేజీకి వచ్చేది. వాళ్ల నాన్నగారూ, చిన్నాన్నగారూకలసి ఉమ్మడిగా పెద్ద వ్యాపార మేదో చేస్తూ ఉండేవారు.

నేనూ, అనూరాధా కలసిమెలసి ఉండడం వల్ల సింహాచలం ఎప్పుడైనా నన్ను కూడా పలకరించడం జరిగేది. అయితే, అనూ నాతో చెప్పకపోయినా,దానికి సింహాచలం అంటే ప్రత్యేకమైన ఇష్టం ఉండే ఉంటుందనీ, అతను చొరవ తీసుకోకపోవడం వల్ల అభిమాన పడిపోయి నాకు చెప్పడానికి సందేహిస్తోందనీ నా మనసుకు తోచేది. విచిత్రంగా కొద్ది రోజులకే సింహాచలం దానికి దూరమౌతూ ముభావంగా ఉండి పట్ట పరీక్ష లయినాక అడ్రసయినా లేకుండా మాయమైపోయాడు.

రెండు మూడేళ్లలోనే సముద్ర కెరటాల్లాగ కష్టాలు ఒకదాని మీద ఇంకొకటిగా మొహాన కొట్టి అనూరాధ జీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. దాని చిన్నాన్న ప్రోద్బలంతోనే ఒకసంబంధం తెచ్చి పెళ్లి చేశారు. పెళ్లి ఆడంబరంగానే జరిగింది. కానీ ఏడాదైనా తిరక్కుండా ఒక రోడ్డు ప్రమాదంలో భర్త పోయాడు. చిన్నాన్న చేసిన మోసం వల్ల వ్యాపారం అంతా దివాలా తీసింది. ఈ కష్టాల్నీ, నష్టాల్నీ తట్టుకోలేక దాని తండ్రి పోయాడు. చినాన్నకి దాసోహం చేస్తూ బతకడానికి ఏమాత్రం ఇష్టంలేక నాతోపాటే ఉద్యోగ ప్రయత్నాలు చేసేది. చదువు అవగానే నేనూ, మా అమ్మా మా తాతగారి గ్రామానికి వెళ్లిపోతే మా అమ్మదగ్గర చనువు కొద్దీ కొన్నాళ్లకి అనూ కూడా అక్కడికే వచ్చి ఉండేది.

షియాల్దాలో రైల్వేవాళ్లు పెట్టిన ఒక ఇంటర్వ్యూకి మేమిద్దరం వెళ్లి వస్తున్నాం. నేను పై బెర్తు మీదకెక్కి పక్క పరుచుకుంటున్నాను, కిందనే కూర్చున్న అనూరాధ ఎవరితోనో మాట్లాడుతోంది. ఎక్కడో పరిచయమున్న మగగొంతు విని తలవంచి కిందకు చూశాను. అతను సింహాచలం.

"చెప్పా పెట్టకుండా ఎక్కడకు మాయమై పోయావ్ సింహాచలం ?" అని పలకరించింది అనూరాధ.

" ఖరగ్పూర్‌లో స్కూల్లో టీచరుగా చేస్తున్నాను. పేదవాణ్ణి కదా ఎలాగో బతకాలి" అన్నాడు నిర్లిప్తంగా.

ఆ మాటల్లో కొంత బాధా, నిష్ఠూరం ధ్వనించినట్టనిపించింది.

" ఇక్కడ ఎవరు మాత్రం శ్రీమంతులు. ఉద్యోగ ప్రయత్నంలో కలకత్తా వెళ్లివస్తున్నాం" అంటున్న అనూ మాటల్లోని బహువచన ప్రయోగానికి ఆశ్చర్యంగా అటూ ఇటూ చూశాడు సింహాచలం.

నేను పై బెర్తు నుండి కిందకు దిగాను. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు అన్ని విషయాలు అరమరిక లేకుండా మాట్లాడుకున్నాం. అలా మాటల సందర్భంలోనే కానీ మాకు ఏ మాత్రం ముందుగా అనూ చిన్నాన్న చేసిన ఘనకార్యం తెలియలేదు. " ఆస్తికోసం ఆశ పెంచుకుని మా అనూరాధ వెంటబడుతున్నా" వని మాటలు విసిరి పదిమంది ముందూ సింహాచలాన్ని చిన్న బుచ్చాడట. ఇంతలో ఖరగ్పూర్ వచ్చింది. సింహాచలం దిగిపోయాడు.

రైలు కదలగానే అనూరాధ వెక్కివెక్కి ఆపుకో లేకుండా ఏడ్చింది. ఎలా ఓదార్చాలో నాకు అర్థం కాలేదు. అలా మేమిద్దరం మా తాతగారి ఊరు వెళ్లాక ఒక వారం రోజులకు అనూరాధ అందుకున్న ఉత్తరాన్ని చదవమని నా చేతికిచ్చింది.

'ఆస్తికోసం ఆరాట పడుతున్నాననే అపవాదుకి అవకాశం ఇప్పుడు లేదని ధైర్యం చేసి నీకు రాస్తున్నాను.

అభ్యంతరం నీకు లేకుంటే ఇక నుంచీ నీ కష్ట సుఖాలు మనవిగా పంచుకునే అవకాశం ఇస్తావని నమ్ముతూ నీ జాబు కోసం ఎదురు చూస్తున్నాను.'

అలా ఇద్దరూ ఒక మాటకు వచ్చాక అరమరికలు, ఆడంబరాలు లేకుండా, కట్న కానుకల ప్రసక్తే లేకుండా పెళ్ళి ఖరగ్పూర్‌లో జరిగింది. అతని స్నేహితులు అన్ని ఏర్పాట్లూ చేశారు. అనూరాధ తరపున పెళ్లివారం నేనూ, మా అమ్మా మాత్రమే. క్రమంగా ఎవరి సంసార బాధ్యతల్లో వాళ్లం పడి చెల్లా చెదరయిపోయాం. ఇన్నేళ్ల తర్వాత ఇలా కలవడం ఆశ్చర్యంగానే ఉంది. ఇప్పుడు జరుగుతున్న పెళ్లి కూడా ఆ పెళ్లిని తలపిస్తున్నాది." కథను పూర్తి చేస్తున్న రమను ఆపి " మరి మీ అనూ రాలేదేం ?" అని అడిగిందా శ్రోత. " ఉంటే రాదూ. ఎంతో అన్యోన్యంగా బతికిందట. కొడుకుని కని, కొన్నాళ్లకు విష జ్వరం వల్ల సింహాచలాన్ని విడిచి వెళ్లిపోయిందట పాపం..." రమ చెప్పింది.

ఇంకా ఏమి చెప్పిందో లక్ష్మి వినలేకుండా సన్నాయి చిన్నగా మోగింది. తన చేతిలోని మల్లెదండను ఆ ముగ్గురు పిల్లలూ ఎప్పుడు తీసుకు వెళ్లిందీ కూడా తెలియనే లేదు. అరచేతులు రెండూ వాసన చూసుకుంది. తియ్యని మల్లెల వాసన. తలెత్తి చూసింది.

ఇందాకా చూసిన పచ్చని కొబ్బరాకుల మంటపం కొత్తకొత్త అందాలు సంతరించుకుంది. పచ్చని కొబ్బరాకుల మీదనుంచి అలలు అలలుగా చుట్లు తిరిగిన పూల మాలికలు ఒక దాని కింద ఇంకొకటిగా నాలుగు రంగులను చూపిస్తూ పరిమళాలు వెదజల్లుతున్నాయి.

తాత ఎన్నో కథలు చెప్పినా, తన కథ ఎన్నడూ చెప్పలేదని కోపం వచ్చి ఒక్క క్షణంలోనే చిరునవ్వుగా మారింది. మొదటి వరుసలో ఒక కుర్చీలో కూర్చున్న తాత అక్షింతలు జల్లుతున్నాడు. పూల తేరులా ఉన్న వేదికలో చైతన్యం నిండింది. అన్ని వేపుల నుండీ అందుతున్న కవ్వింపులకూ ప్రోత్సాహానికీ అనుగుణంగా వధూవరులు ఇద్దరూ ఒకరి కొకరు ఏమాత్రం తీసిపోకుండా తలంబ్రాలు పోసుకుంటూ నవ్వులు విరజిమ్ముతూ ఉంటే తదేకంగా చూస్తున్న లక్ష్మి విశాలమైన కళ్లలో సంకోచపు క్రీనీడలు కానరాలేదు. ' జీవితం ఒక వరం - జీవించడం ఒక కళ.' అని తాతా తరచూ అనే మాటలు ఆ క్షణం గుర్తుకు వచ్చాయి. పూలతేరులా పరిమళిస్తున్న వేదిక కళకళ లాడుతోంది.

- ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

**29-1-1997**